సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి దేవస్థానం అన్నప్రసాద భవన నిర్మాణానికి పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన ఉప్పలూరి గోపాలకృష్ణమూర్తి-ఇందిరాదేవి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. దాత లకు సిబ్బంది స్వామి చిత్రపటాన్ని అందజేశారు.




8లో

ఉత్సాహ భరితంగా స్పోర్ట్స్ మీట్

విజయం కోసం పరుగు పడుతూ.. వారిలో ప్రతి భను బయటకు చాటారు. పరుగులోనే కాదు షాట్‌పుట్, లాంగ్ జంప్ ఇలా స్పోర్ట్స్ ఏదైనా విజ యం సాధించడమే లక్ష్యంగా తమలోని క్రీడా స్ఫూర్తిని చాటుకుంటూ విజయం సాధించారు.

5.06 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం రాత్రి 5,06,437 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడిచారు. డెల్టా కాలువ లకు సంబంధించి 11,800 క్యూసె క్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలంలో 36.10 అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

ఎస్పీగా రాహుల్ మీనా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్ మీనా

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీగా రాహుల్ మీనా ఆది వారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయనకు జిల్లా అదనపు ఎస్పీ ఏవీఆ ర్‌పీబీ ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఆహ్వా నించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించగానే ఆయనను అమలాపురం, కొత్తపేట, రామచం ద్రపురం డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్, సుం కర మురళీమోహన్, రఘువీర్‌తో పాటు జిల్లా ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, సీఐలు, ఎస్సైలు మర్యాద పూర్వకంగా కలసి పరిచయం చేసుకు న్నారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ బి.రాజశేఖర్, డీసీ ఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు, సోషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వరరావు, అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కు మార్ తదితరులు నూతన ఎస్పీని కలిశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల సమర్పణ



అంతర్వేది ఆలయంలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న దాత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన దాత అఖండం వెంకట రమణ మూర్తి, కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళం సమ ర్పించారు. పైమొత్తాన్ని అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్‌కు ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ప్రజా సమ స్యల పరిష్కార వేదికను సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహి స్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదా రులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొం దాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యా లయాలు, మండల తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ జరుగు తుందన్నారు.

17 నుంచి స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్

అమలాపురం రూరల్: ప్రధాని జన్మదినోత్స వాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న నరేంద్ర మోదీ స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభించి అక్టోబర్ 2 వరకూ నిర్వహి స్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం .దుర్గారావు దొర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మహిళలు, బాలికల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, గ్రామ హెల్త్ సెం టర్లలో ఆరోగ్య శిబిరాలను నిర్వహి స్తామన్నారు. అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తామని వివరించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మహా కార్యక్రమాలు పాటిస్తామన్నారు.

తలుపులమ్మ తల్లి ఆదాయం రూ.6.14 లక్షలు

తుని రూరల్: కోరిన కోర్కెలు తీర్చే తలుపు లమ్మతల్లి దర్శనానికి వచ్చిన భక్తులతో లోవ జనసంద్రమైంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భక్తులు లోవ దేవ స్థానానికి చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా 16 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించు కున్నట్లు డిప్యూటీ కమిషనర్ పి.విశ్వనాథ రాజు తెలిపారు. ఆలయ పరిసరాల్లో, తోటల్లో వంటలను చేసుకుని భక్తులు ఆరగించారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.2,11,095, పూజా టికెట్లు రూ.2,35,580, కేశఖండన శాలకు రూ.16,160, వాహన పూజ లకు రూ.8180, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.95,792, విరాళాలు రూ.46,440 వెరసి మొత్తం రూ.6,14,247 ఆదాయం లభించినట్టు విశ్వనాథరాజు వివరించారు.

నిజాలు భరించలేకే జులుం చూపిస్తున్నారు



ప్రభుత్వ పరంగా జరుగుతున్న తప్పొప్పులను ప్రజలకు నిర్భయంగా తెలియజేసే ప్రయత్నం చేస్తున్న 'సాక్షి' పత్రిక, పత్రిక సంపాదకుడు ఆర్.ధనుంజయరెడ్డిపై కూటమి కక్ష కట్టింది. ఇది ప్రజాస్వామ్యబద్ధం కాదు. అధికారం అనేది ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని మరచి, నిజాలు వెల్లడిస్తున్న పత్రికల మీద కేసులు పెట్టడం హేయమైన చర్య. పాలకులకు, ప్రజలకు వారధులుగా నిలిచి, ప్రగతికి తోడ్పడే పత్రికలపై కక్ష సాధింపునకు దిగడం పాలకుల పిరికితనానికి నిదర్శనం.

– జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే, రాజానగరం



అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం



అక్రమ కేసులతో 'సాక్షి' యాజమాన్యాన్ని వేధింపులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య. గతంలో ఎప్పుడూ ఇలాంటి విష సంస్కృతి లేదు. ఈ పరిణామాలు చూస్తుం టే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా అనే సందేహం కలుగుతోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక చర్యలను ప్రశ్నించడమే నేరమా? 'సాక్షి' మీడియాపై అక్రమ కేసులు పెడుతూ గొంతు నొక్కాలని చూడడం సరికారు. దీనిని అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా ఈ చర్యలను ప్రభుత్వం విడనాడాలి.

–పాముల రాజేశ్వరీదేవి, మాజీ ఎమ్మెల్యే

గుణపాఠం చెప్పాలని..

- ప్రభుత్వ విధానాలపై తిరుగుబాటు
- ఉపాధ్యాయ సమస్యలపై 'రణభేరి జాతా'కు సిద్ధం
- నేటి నుంచి 20 వరకూ ఉమ్మడి జిల్లాలో జాతా
- 25న విజయవాడలో బహిరంగ సభ

అక్షరాలు దిద్దించే గురువులకు ఆపసోపాలు తప్పడం లేదు.. భావితరం రాతను మార్చే ఉపాధ్యాయుల తలరాత మారడం లేదు.. సమాజ నిర్దేశకులుగా పిలిచే ఆ బోధకుల బాధను ప్రభుత్వం తీర్చడం లేదు.. చెప్పి చెప్పి విసిగిపోయిన వారు ప్రభుత్వానికి గుణ'పాఠం' చెప్పేందుకు సిద్ధమయ్యారు.. ప్రభుత్వ విద్యను కాపాడే కార్యాచరణలో భాగంగా యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో 'రణభేరి జాతా' పేరుతో విద్యారంగ పరిరక్షణకు కార్యాచరణ చేపట్టారు. సోమవారం నుంచి ఈ నెల 20 వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతా నిర్వహించనున్నారు.

కపిలేశ్వరపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 18 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. కోనసీమ జిల్లాలో 5,800, కాకినాడ జిల్లాలో 6,500, తూర్పు గోదావరి జిల్లాలో 5,700 బోధకులు పని చేస్తు న్నారు. వీరు తమ డిమాండ్ల సాధన కోసం ఆం దోళనలు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తూనే ఉన్నాయి. అయినా స్పందన లేక 'రణభేరి జాతా'కు సిద్ధమయ్యారు. ప్రధానంగా 12వ పీఆర్సీని అమలు చేసే లోపు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని, కరోనా సమ యంలో మరణించిన ఉద్యోగ ఉపాధ్యాయుల వార సులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేసి ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈఓ, డైట్ ప్రిన్సి పాల్, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని, పెండిం గ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపునకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని ప్రభుత్వానికి ఉపాధ్యా యులు అనేక సార్లు విన్నవించారు. ఆ మేరకు వివిధ సంఘాల ద్వారా వినతి పత్రాలను అందజే సినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.

ప్రశ్నించే ఆయుధం నిర్వీర్యం

ప్రజాస్వామ్య పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయంలోకి ఇతరులు ప్రవే శించరాదంటూ అప్రజాస్వామిక జీఓను జారీ చేసింది. ప్రభుత్వ జీఓ ప్రజాస్వామ్యం లో ప్రశ్నించే ఆయుధాన్ని నిర్వీర్యం చేయ డమే అవుతుందని విద్యార్థి సంఘాలు నేతలు అంటున్నారు. పాఠశాలల్లో అసౌక ర్యాలు ఉన్నా ఎవరూ అడగకుండా ఉండా లనేది ప్రభుత్వ ముఖ్యోద్దేశంగా ఉందని విమర్శిస్తున్నారు.

'రణభేరి జాతా' ఎక్కడెక్కడంటే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఉపాధ్యాయుల సమస్యపై కనీసం పట్టిం చుకోవడం లేదు. దీంతో అనివార్య పరిస్థితుల్లో ఆం దోళనకు దిగుతున్నామని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు ప్రకటించారు. పాఠశాల విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా సోమవారం నుంచి 20 వరకూ సాగే జాతా ద్వారా ఉపాధ్యాయులు, ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. 15న కాకినాడ జిల్లా, 16న అల్లూరి సీతారామరాజు మన్యం, తూర్పుగోదావరి జిల్లాల్లో, 17న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, 18న పశ్చిమ గోదావరి, 19న ఏలూరు జిల్లాల్లో జాతా సాగుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో జాతాలతో పాటు ఉత్తరాంధ్రలో ఒకటి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒకటి, తూర్పు రాయలసీమలో ఒకటి, పశ్చిమ రాయలసీమలో ఒకటి కలపి మొత్తం ఐదు జాతాలు తిరుగు తాయన్నారు. చివరిగా ఈ నెల 25న విజయవా డలో భారీ బహిరంగ సభ ద్వారా కూటమి ప్రభుత్వంపై డిమాండ్ల సాధన కోసం ఒత్తిడి తీసుకొ స్తామని యూటీఎఫ్ నాయకులు చెబుతున్నారు.



జూలై 26న ముమ్మిడివరం డీఈఓ కార్యాలయం ఎదుట పనిభార వ్యతిరేక ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఐవీ

విన్నపాలు వినలే..

తమ సమస్యలు పట్టించుకోవాలని ఉపాధ్యాయ సం ఘాలు అనేక సార్లు ఉద్యమించారు. ప్రభుత్వానికి విన్నపాలు అందజేశారు. అయినా పట్టించుకోకపోవ డంతో ప్రభుత్వంపై ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 5 వరకూ నిరసన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రిల్ 2న తమకు ఇవ్వాల్సిన బకాయిలను తక్షణం చెల్లించా లన్న డిమాండ్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనలు చేశారు. ఈ ఏడాది ఆగస్టు 2న కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట యాప్‌ల భారం తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆం దోళన చేపట్టారు. ఉపాధ్యాయులకు వివిధ రకాలుగా రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లిం చాల్సి ఉంది.

బోధన.. అవస్థల మాటున

విద్యార్థులకు విద్యాబుద్ధులను చెప్పే పనిని చేయ **నీయకుండా కూటమి** ప్రభుత్వం తమ ప్రచార **యావను గురువులపై** రుద్దుతోంది. మెగా పీటీ **ఎం 2.0 పేరుతో జూలై** 10న నిర్వహించిన పేరెం **ట్స్, టీచర్స్ మీటింగ్‌ను** తల్లికి వందనం పథకం **ప్రచార కార్యక్రమంగా** నిర్వహించింది. ఏడాది **ఎగ్గొట్టి అరకొరగా మాత్రమే** ఇచ్చిన సాయానికి **అంత ప్రచారం అవసరమా** అనే వాదన అంద **రిలో వినిపించింది.** కార్యక్రమం నిర్వహణకు 17 **కమిటీలు వేసి పండగలా** నిర్వహించాలని ఇచ్చిన **ఆదేశాలు ఒత్తిడికి** గురిచేసింది. బోధనేతర **పనుల నుంచి టీచర్లను** మినహాయించాలని కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పీ–4 నుంచి ఉపాధ్యాయులను మినహాయించా లన్న డిమాండ్‌ను ఉద్యమంతో సాధించుకు న్నారు. యాప్‌ల భారం తగ్గించాలని కోరగా, పని భారాన్ని ఏమాత్రమూ తగ్గించకుండా చేశా మన్న పేరుకు ప్రభుత్వం అన్ని యాప్‌లను ఒకే వేదికకు మాత్రమే చేర్చింది.

భాగస్వాములు కావాలి



ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారమే లక్ష్యంగా రణభేరి జాతాను నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ విద్యను కాపాడు కోవాలనే సామాజిక బాధ్య తతో జాతాతో ప్రజల ముందుకు వెళ్తున్నాం. ఇప్ప టికే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వానికి నివే దించాం. ఈ జాతాలో ఉపాధ్యాయులంతా భాగ స్వాములు కావాలి.

–పి.సురేంద్ర,
యూటీఎఫ్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు

పొంతన లేని సమాధానాలు మానుకో..

- కించపరిచేలా మాట్లాడితే ఊరుకోం
- మంత్రి సుభాష్‌పై వైఎస్సార్ సీపీ శెట్టిబలిజ నేతల ధ్వజం



మంత్రి సుభాష్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాష్, శెట్టిబలిజ నేతలు

అమలాపురం టౌన్: శెట్టిబలిజలకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న అన్యాయం గురించి అడిగితే మంత్రి వాసంశెట్టి సుభాష్ పొంతన లేకుం డా మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీకి చెందిన జిల్లా శెట్టిబలిజ నేతలు మూకుమ్మడిగా ధ్వజమె త్తారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్య క్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ శెట్టిబలిజ నేతలు అమలాపురంలోని వాసర్ల గార్డెన్‌లో ఆదివారం సమావేశమయ్యారు. మంత్రి సుభాష్ అనుచిత వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి బొక్కా వెంకట లక్ష్మి, కోనసీమ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు మట్టపర్తి మీరాసాహెబ్ శెట్టి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, కొత్తపేట జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాస్, శెట్టిబలిజ యువజన అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసరావు తదితరులు మంత్రి సుభాష్ వ్యాఖ్య లపై విరుచుకుపడ్డారు. శెట్టిబలిజలకు ఈ ప్రభుత్వం సుమోటోగా గౌడ (శెట్టిబలిజ) అని కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్న అన్యాయంపై కలెక్టర్‌కు పార్టీ సామాజిక వర్గం తరఫున జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ద్వారా వినతి పత్రాలు అందించామన్నారు. అందుకు మంత్రి సుభాష్ మొదట సాంకేతిక లోపం తో ఇలా జరిగిందని, మరోసారి ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని పొంతన లేని మాటలు చెప్పారని గుర్తు చేశారు. అంతే కాకుండా తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిపై, జగ్గిరెడ్డిపై ఇష్టం వచ్చి నట్లు మాట్లాడడం మంత్రి సుభాష్‌కు రాజకీయాల పట్ల ఎంత అవగాహన ఉందో అర్థమవుతోంద న్నారు. 1997లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే గౌడ (శెట్టిబలిజ) అని కుల ధ్రువీకరణ పత్రం జారీకి జీఓ ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లేని ఈ సమస్య ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనే ఎందుకు వచ్చిందని వారు ప్రశ్నిం చారు. అంటే చంద్రబాబుతో పాటు సుభాష్ ఎక్క డున్నా కులాల కుంపటి రాజేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కులాలను విడదీయడం, వారు తన్నుకుంటుంటే చూసి ఆనందిండచం పైశాచికత్వం గా మారిందని విమర్శించారు. మంత్రి వర్గంలో 25 మంత్రులుంటే ముఖ్యమంత్రి వారికి ర్యాంకులు ఇచ్చినప్పుడు సుభాష్‌కు 25వ ర్యాంక్ ఇవ్వడంతోనే సుభాష్ మంత్రి పదవిని ఎంత గొప్పగా నిర్వహిస్తు న్నారో ప్రజలకు తెలిసిందని అన్నారు. శెట్టిబలిజల పరువు తీసేలా సుభాష్ ప్రవర్తించడం బాధాకరంగా ఉందన్నారు. అసలు శెట్టిబలిజల సామాజిక వర్గం కోటా వల్లే ఆయనకు మంత్రి పదవి వచ్చిందన్న విష యాన్ని విస్మరించి మాట్లాడుతున్నారని ఆరోపిం చారు. ఇకపై తమ పార్టీ అధినేత జగన్ గురించి, తమ పార్టీ నేతల గురించి నోటికొచ్చినట్లు మాట్లా డితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

రూ. కోటి జమ ఏమైంది..?

శెట్టిబలిజల వన సమారాధన వేదికపై తాను శెట్టి బలిజ యూత్ ఫోర్స్ తరఫున రూ.కోటి జమ చేసి ఆ నిధులను తమ సామాజికవర్గ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌తో ఉపాధి మార్గాలు చూపి స్తానని గతంలో మంత్రి సుభాష్ చెప్పిన మాటలను పట్టణ పార్టీ అధ్యక్షుడు బులినాని గుర్తు చేశారు. ఇంత వరకూ రూ.కోటి జమ చేయలేదని, ఆ నిధులు ఏమయ్యాయని ప్రశ్నిం చారు. ఈ సమావేశంలో అమలాపురం మున్సి పల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పార్టీకి చెందిన శెట్టిబలిజ నేతలు విత్తనాల శేఖర్, కముజు రమణ, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, కుడుపూడి భరత్ భూషణ్, విత్తనాల మూర్తి, కాంగ్రేగుల గోపి, వాసర్ల సుబ్బారావు, దొంగ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

భజే గణనాయకా..



అయినవిల్లి ఆలయ అన్నదాన సత్రంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామివారికి మేలుకొలుపు సేవ, గరిక పూజ పూజ చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 60 మంది, పంచామృతాభిషేకాల్లో ఒక జంట, లక్ష్మీగణపతి హోమంలో 19 జంటలు, పం చామృతాభిషేకాల్లో ఇరువురు దంపతులు పాల్గొ న్నారు. ఐదుగురు చిన్నారులకు అన్నప్రాశన, నలుగు రికి తులాభారం నిర్వహించారు. 17 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 3,100 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ ఒక్క రోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.2,44,843 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్య నారాయణరాజు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

సఖినేటిపల్లి: మోరిలోని పార్వతీ సీతారామలింగేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి మోరిపోడుకు చెందిన పలువురు దాతలు రూ.2,33,116 విరాళం అందజేశారు. డెన్మార్క్‌లో ఉంటున్న వారు ఆన్‌లై న్‌లో బ్యాంకు ఖాతాకు జమ చేసినట్టు ఆదివారం కమిటీ సభ్యులు తెలిపారు. డాక్టర్లు వలవల గం గాధర్, సునీతలు వారి తాతయ్య వలవల గంగరాజు జ్ఞాపకార్థం రూ.1,00,116, వలవల శ్రీరామకార్తీక్ వారి తాతయ్య వలవల రామారావు జ్ఞాపకార్థం రూ.1,08,000, వలవల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి ముని మనవడు వలవల రోహన్ రూ.25 వేలు విరాళంగా అందజేశారని కమిటీ పేర్కొంది.

మళ్లీ పెరుగుతున్న వరద



పి.గన్నవరం కొత్త, పాత అక్విడెక్టుల మధ్య వరద ఉధృతి

పి.గన్నవరం: గోదావరి ఎగువ ప్రాంతాల వస్తున్న వరద నీటితో జిల్లాలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి మళ్లీ వరద రావడంతో లంక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మూడు సార్లు వచ్చిన వరదలతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆవే దన చెందుతున్నారు. నాలుగో సారి వరద రావడం తో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే రెండు నెలలుగా పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలపై రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే. వరద ఉధృతి పెర గడంతో పడవలు దాటే సమయంలో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్మార్తమే అపర కర్మలకు మూలం

అపర విద్వత్సభలో ఘనపాఠీలు

అమలాపురం టౌన్: స్మార్తమే అపర కర్మలకు మూలమై మానవ మనుగడలో కీలకమైందని వేద ఘనపాఠీలు ఉద్బోధించారు. శ్రీకోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో అమలా పురం సుబ్బారాయుడి చెరువు వద్ద ఉన్న చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆది వారం స్మార్తాగమ అపర విద్వత్సభ జరిగింది. ఘనపాఠీలు మాట్లాడుతూ వేదాల నుంచే స్మార్త, ఆగమ, అపర కర్మల విధానాలు జన్మించాయని అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మావుళ్లమ్మ దేవస్థానం విద్వాంసులు యీవని వెంకటరామచంద్ర సోమయాజి మాట్లాడుతూ వేదాలకు మూలం స్మార్తం అయితే, ఆ స్మార్తమే అపర కర్మలకు మూలమని అన్నారు. వైఖానస ఆగమ పండితుడు, అంతర్వేది లక్ష్మీ నరసిం హస్వామి దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు వాడపల్లి శేషాచార్యులు అపర కర్మలు నిర్వహించే విధానాలను వివరించారు. కృష్ణ యజుర్వేద పరీ క్షాధికారి, పిఠాపురానికి చెందిన మహంకాళి దత్తా త్రేయశర్మ మాట్లాడుతూ కాలమాన పరిస్థితుల దృష్ట్యా షోడశ కర్మల నిర్వహణలో చిన్న చిన్న మార్పులు అనివార్యమైనా కర్మల ప్రాధాన్యం, విలువ ఏ మాత్రం తగ్గలేదన్నారు.

యజుర్వేద, రుగ్వేద, అపర పండితులు భగవతి నారాయణశాస్త్రి, శైవాగమ పండితులు నవులూరి దీక్షితులు, వాస్తు జ్యోతిష పండితులు గరిమెళ్ల భాస్కర గంగాధరశాస్త్రి మాట్లాడుతూ స్మార్త పండితులు పలు సందర్భాల్లో 16 కర్మలు నిర్వహిస్తున్నప్పుడు కర్మలు చేయించుకునే వారి సంతృప్తిని కూడా పరిగణనలోకి తీసుకోవాల న్నారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ కార్య దర్శి గుళ్లపల్లి వెంకట్రామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విద్వత్సభలో సభ ప్రతినిధులు యేడిది సుబ్ర హ్మణ్యశర్మ, శిష్టా భాస్కర్, ఆదిరాజు భాస్కర శర్మలు స్మార్త పండితులకు సత్కార సేవలు అం దించారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి హాజ రైన 150 మంది స్మార్త, ఆగమ, అపర పండితులు పాల్గొని వేద ఘనపాఠీలు వివరించిన స్మార్త నిబం ధనలు విన్నారు. సభ చివర్లో ఇటీవల రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఆకెళ్ల వెంకట నారాయణ అవధానిని వేదశాస్త్ర సన్మాన సభ తరఫున ఘనంగా సత్కరించారు. వేదాభిమాని పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు సేవలు అందించారు.



అపర కర్మల గురించి వివరిస్తున్న వేద పండితులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

గుండెపోటుతో ఉద్యోగి మృతి



వీరభద్రం (ఫైల్)

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూల్లో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎం.వీరభద్రం (42) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. నల్లజర్ల మండలం దూబచర్లలో నివాసం ఉంటున్న వీరభద్రంకు ఛాతీలో నొప్పి రావడంతో కటుంబ సభ్యులు నల్లజర్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వీరభద్రం మృతి చెందినట్టు నిర్ధారించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టి యువకుడు..

తొండంగి: మండలంలోని కృష్ణాపురం వెళ్లే రహదారిలో బైకు అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై జగన్మోహన్‌రావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాపురం శివారులో అవంతి రొయ్యల పరిశ్రమలో విజయనగరం జిల్లా బోడంగి మండలం రాజేరు గ్రామానికి చెందిన పోతాబత్తుల చరణ్‌కుమార్ (20) డైలీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి సెలవు పెట్టి బైకుపై కృష్ణాపురం వస్తుండగా ఓ ప్రైవేటు స్కూలు వద్దకు వచ్చే సరికి బైకు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలై అపస్మారకస్థితికి చేరుకోవడంతో అంబులెన్స్‌లో తుని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడన్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంరక్షణతో దినదినాభివృద్ధి

- చూడి కట్టే వరకూ జాగ్రత్తలే మేలు
- ఈతకు ఈతకు మధ్య వ్యవధి తగ్గించాలి
- ఆరోగ్యకరమైన దూడలతో అధిక పాల దిగుబడి



పచ్చిగడ్డి తింటున్న గేదెలు



దూడకు పాలిస్తున్న ఆవు

పాడి-పంట

ఆలమూరు: పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, సమతుల పోషకాహారాన్ని అందించడం, సమీకృత దాణాను అందుబాటులో ఉంచడం, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పశుగణం దినదినాభివృద్ధి చెందుతుంది. పశువులకు దూడలు జన్మించిన నాటి నుంచి యుక్తవయసు వచ్చి సంపర్కం జరిగి చూడి కట్టే వరకూ పాడిరైతులు ప్రత్యేక ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈతకు ఈతకు మధ్య వ్యవధిని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన దూడలతో పాటు అధిక పాల దిగుబడి ఆశించవచ్చు. సాధారణంగా ఉత్తమజాతి ఆవు కాని గేదె కాని 300 రోజుల పాటు ఏకధాటిగా పాలిస్తుంది. అనంతరం ఆ పశువు పాల ఉత్పత్తి కొంచెం కొంచెం మందగించి చివరకు వట్టిపోయే దశకు చేరుకుంటుంది. దీని వల్ల పాడి పశువులకు ఈత మధ్య ఎడం తగ్గించడం ద్వారా లాభదాయకంగా ఉంటుంది. దీంతో పాడి పశువు వట్టిపోయే కాలం తగ్గిపోవడంతో పాడి రైతుకు కొంత ఉపశమనం కలుగుతుంది.

సకాలంలో చూడి పరీక్షలు చేయించాలి

గేదె ఈనిన మూడు నుంచి నాలుగు నెలల్లోపు చూడి కట్టించడం ద్వారా పశువు వట్టిపోయే లోపు మళ్లీ ఈతకు వచ్చి పాల దిగుబడినిస్తుంది. ఈ ప్రక్రియ వల్ల పశువు వట్టిపోయే కాలం అసాధారణంగా తగ్గుతుంది. ఒక మేలుజాతి పశువు పాలిచ్చే సమయంలో ఆరోగ్యకరమైన దూడల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. చూడి పరీక్షలు సకాలంలో చేయించడం, సమీకృత దాణా గాని పచ్చగడ్డితో కాని పశువులను మేపడం ద్వారా ఈత వ్యవధి తక్కువైనా పశువుల ఆరోగ్యంపై ఎటువంటి దుష్ప్రభావం పడే అవకాశం లేదు. పాడి పశువుల్లో జననేంద్రియ వ్యవస్థ పూర్తిగా అభివృద్ధి చెంది పునరుత్పత్తి జరపగలిగే విధంగా విడుదల చేసే అండాన్ని ధను ప్యూబర్టీ (యుక్త వయసు) అంటారు. దేశవాళీ పశువుల కంటే సంకర జాతి పశువులు త్వరితగతిన యుక్తవయస్సుకు రావచ్చు. అలాగే యుక్త వయస్సుకు రాని పశువులను మేపుట వల్ల రైతుకు భారంగా ఉంటుంది. ఈ సమస్యలను ఎదుర్కొనేందుకు పశువుల్లో యుక్త వయసుకు రాగానే చూడి కట్టించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. దీంతో ప్రతి పాడి పశువు ఏడాదికి ఒక దూడకు జన్మనివ్వడం సులభతరమవుతుంది. దీనిద్వారా పశువుల జీవితకాలంలో జన్మించే పశువుల సంఖ్య పెరగడం ద్వారా పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచవచ్చని ఆలమూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఎల్.అనిత చెబుతున్నారు.

పశువు వయసును బట్టి శరీర బరువు ఉండాలి

యుక్త వయసును ప్రభావితం చేసే అంశాల్లో ప్రధానంగా పశువు శరీర బరువు, పెయ్య దూడల పరిపక్వత వాటి వయసు కంటే కూడా శరీర బరువు మీద ఎక్కువశాతం ఆధారపడి ఉంటుంది. సహజంగా సరైన బరువు ఉన్న పశువులు లేదా తక్కువ బరువు కలిగిన పశువులు త్వరగా యుక్త వయసుకు వచ్చే అవకాశం ఉంది.

వాతావరణ ప్రభావం కీలకమే..

పశువుల్లో యుక్త వయసును ప్రభావితం చేసే కాలానుగుణ, ప్రకృతిపరమైన అంశాల్లో ఋతువు ప్రాధాన్యత సంతరించుకుంటుంది. పాడి పశువుల్లో శీతాకాలం లేదా శరదృతువు అనేది యుక్త వయసు ప్రారంభానికి అనుకూలంగా ఉంటుంది. వసంత ఋతువు లేదా వేసవిలో పుట్టిన పెయ్యల కంటే శీతాకాలంలో జన్మించిన పెయ్య దూడలు ఏడు నెలల వయసు వచ్చేటప్పటికి వేసవిలో సంభవించే ఉష్ణోగ్రత వల్ల సూర్యకాంతి ప్రసరణ జరిగి కౌమారదశకు చేరుకున్న పశువులు ఎదకు వచ్చే అవకాశం ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



ఎల్.అనిత

- పెయ్యదూడ వయసు నుంచే పోషణ నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి. దూడలకు ముర్రుపాలను పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- కౌమారదశలో ఉన్న పశువులకు తప్పనిసరిగా సమతుల ఆహారాన్ని, ఖనిజ లవణ మిశ్రమాన్ని తగు మోతాదులో అందించాలి.
- పశువుల్లో తరచూ సంభవించే వ్యాధుల నివారణకు సకాలంలో సరైన మోతాదులో నట్టల నివారణ మందులు అందించాలి.
- వ్యాధి నిరోధక టీకాలను కాలానుగుణంగా సకాలంలో అందించాలి.
- పశువులను అధిక వేడి, వేడి గాలుల నుంచి రక్షణ కల్పించాలి.
- యుక్త వయసుకు త్వరగా రాని పశువులను కొంత కాలం కోడె పశువులతో కలిపి ఉంచడం వల్ల సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.
- యాజమాన్య పద్ధతులు ఫలించక పోయినా రైతులు నిరుత్సాహపడకుండా తమ పశువులకు పశువైద్యుడితో పరీక్షలు చేయించి చికిత్స అందిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు.

ఖతార్ నుంచి ఇంటికి చేరిన కనకమహాలక్ష్మి



కాట్రేనికోన/అమలాపురం రూరల్: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ మొక్కలతిప్ప జైభీమ్ నగర్‌కు చెందిన గోడి కనకమహాలక్ష్మి బతుకుదెరువు కోసం ఖతార్ దేశానికి వెళ్లింది. అయితే ఇటీవల తీవ్ర అనారోగ్యం, పనిఒత్తిడి అధికంగా ఉందని, యజమానుల నుంచి వేధింపులు అధికంగా ఉన్నాయని కన్నీరు మున్నీరవుతూ కనకమహాలక్ష్మి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో వైరల్ అయింది. దీనిపై స్పందించిన కలెక్టర్ మహేష్ కుమార్ కనకమహాలక్ష్మిని స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోనసీమ సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ (కేసీఎం) అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో కేసీఎం బృందం భారత రాయబార కార్యాలయం అధికారులతో సంప్రదింపులు జరిపి కనకమహాలక్ష్మిని స్వదేశానికి రప్పించినట్లు కేసీఎం నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి గోళ్ళ రమేష్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, ఇంటి యజమానులు వేధింపులు అధికం కావడంతో ఇంటికి చేరుకుంటానని అనుకోలేదని, సురక్షితంగా ఇంటికి చేర్చిన జిల్లా కలెక్టర్, కేసీఎం బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

ముగిసిన టెన్నికాయిట్ పోటీలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజులు పాటు నిర్వహించిన ఏపీ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మహిళల విభాగంలో విజయనగరం జిల్లాకు చెందిన పి.మౌనిక ప్రథమ, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జి.హేమ మాధురి ద్వితీయ, విజయనగరం జిల్లాకు చెందిన పి.రేణుక తృతీయ స్థానాల్లో నిలిచారు. పురుషుల విభాగంలో కాకినాడ జిల్లాకు చెందిన పీజేఎండీ రామారావు ప్రథమ, వి.వినయ్‌కుమార్ ద్వితీయ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి.సిద్ధార్థ తృతీయ స్థానాల్లో నిలిచారు. వారిని అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో 50 మంది కోచ్ కం మేనేజర్స్ టెక్నికల్ ఆఫీసర్లు పోటీల నిర్వహణలో కృషి చేశారు.

విద్యుత్ షాక్‌తో సివిల్ కాంట్రాక్టర్ మృతి



నాగబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

అల్లవరం: మండలంలోని డి.రావుల పాలెం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వంటెద్దు నాగబాబు తూర్పులంక రెవెన్యూ పరిధిలోని గుండెపూడి డ్రైన్ ఆనుకుని ఉన్న రొయ్యల చెరువులో ఆదివారం విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. డి.రావులపాలేనికి చెందిన నాగబాబు గత కొంత కాలంగా సివిల్ కాంట్రాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఆక్వా సాగు చేస్తున్నాడు. మృతుడి కుటుంబీకుల వివరాల ప్రకారం ఇటీవల లీజుకు తీసుకున్న చెరువులో రొయ్య పిల్ల వేయడానికి ఆదివారం ఉదయం డి.రావులపాలెంలో తన ఇంటి నుంచి బయలుదేరి గుండెపూడిలో లీజుకు తీసుకున్న రొయ్యల వద్దకు వెళ్లి చెరువులో కంప లాగుతున్న క్రమంలో ఏరియేటర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చెరువుల వద్ద సమయానికి ఎవరూ లేకపోవడంతో నాగబాబు అక్కడికక్కడే మృతి చెంది నీటిలో మునిగిపోయాడు. ఉదయం పది గంటల నుంచి మృతుడి భార్య పలుమార్లు భర్తకి ఫోన్ చేసింది. అయితే ఫోన్‌కు స్పందించకపోవడంతో కొమరగిరిపట్నంలోని తన అన్నకు ఫోన్ చేసి చెప్పింది. సతీష్ హుటాహుటినా వెళ్లి రొయ్యల చెరువు వద్దకు వచ్చి చూడగా నాగబాబు విగతజీవుడై చెరువులో కనిపించాడు. దీంతో మృతుడి అన్నదమ్ములకు నాగబాబు మరణవార్తని సతీష్ తెలిపాడు. మృతుడి అన్నలు చెరువు వద్దకు వచ్చి నీటిలో ఏరియేటర్ వద్ద మునిగి ఉన్న తమ్ముడి మృతదేహాన్ని సతీష్‌తో కలసి ఒడ్డుకి చేర్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు కుటుంబీకులు అల్లవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సంపత్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. నెల రోజుల వ్యవధిలో తల్లి, సోదరుడుని కోల్పోవడంతో అన్నదమ్ములు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా తూర్పుగోదావరి

ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన తూర్పుగోదావరి జట్టు

బత్తలపల్లి: మండలంలోని రామాపురం జెడ్పీహెచ్ఎస్ మైదానం వేదికగా మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల 10వ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నీ ఆదివారం ముగిసింది. అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీ చాంపియన్‌షిప్‌ను బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. కాగా, ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాలుగో స్థానంలో ప్రకాశం జిల్లా జట్టు నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో రెండో స్థానంలో విశాఖపట్నం, మూడో స్థానంలో తూర్పుగోదావరి, నాలుగో స్థానంలో శ్రీకాకుళం జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలను ముఖ్యఅతిథులు అందించి, అభినందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కోలాటంతో స్థానిక కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ తలారి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, రాష్ట్రబాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, చైర్మన్ వెంకట్రావు, జనరల్ సెక్రటరీ బాలాజీ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, జనరల్ సెక్రటరీ వెంకటేష్, నాయకులు ధర్మవరం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అయ్యప్ప నాయుడు, చిలకం మధుసూదన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఆకులేటి వీరనారప్ప, పురంశెట్టి రవి, గ్రామ పెద్దలు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



షేక్ మంసూర్ బాషా

రాజానగరం: మండలంలోని సూర్యారావుపేటలో నివాసం ఉంటున్న తన బావ షేక్ మంసూర్ బాషా ఆగస్టు 30 నుంచి కనిపించడం లేదని, అతని ఆచూకీ తెలుసుకోవలసిందిగా సయ్యద్ అల్లా భకాష్ స్థానిక పోలీసులను ఆదివారం విజ్ఞప్తి చేశాడు. కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన తాము జీఎస్ఎల్ వైద్య కళాశాలలో టైల్స్ పనుల నిమిత్తం ఎనిమిది మంది ఇక్కడకు వచ్చి, సూర్యారావుపేటలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నామన్నాడు. అయితే ఆగస్టు 30న సాయంత్రం అక్కకు ఫోన్ చేసి ఇంటికి వచ్చేస్తున్నానని చెప్పిన తన బావ ఇంతవరకు ఇంటికి చేరలేదన్నాడు. స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద గాలించి, చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నాడు. ఈ మేరకు కేసు =దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పీవీ నారాయణస్వామి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796585, 7780681168 నంబర్లకు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ కాకినాడ, వాకలపూడి గంగానగర్‌లో డోర్. నెం.3-98/4, సూర్య సినిమా హాల్ వెనుక 2వ వీధిలో 200 గ॥లలో 2BHK ఇల్లు అమ్మకము. Contact: ✆ : 88978 39185 [R-78]

Wanted

■ కస్టల్లేస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-16139]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ : 18K. Ph: 9640468899, 9640258899 [SCA25008061]

■ Wanted Male Marketing Team Leaders Qualification Any Degree, Age Limit: 23 to 45 Years, Salary: 15000/-, Male & Female Class Incharge Age Limit: 25 to 35 Years, Salary : 12000/- Location: Rajahmundry. Contact: 92487 33370 [G-6181]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోజురోజుకూ పెరుగుతున్న భక్తులు

- రూ.80 లక్షలు దాటిన శనివారం ఆదాయం
- విస్తరిస్తున్న వెంకన్న ఖ్యాతి



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఖ్యాతి రోజురోజుకూ పెరిగిపోతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం ముఖ్యంగా ప్రతి శనివారం ఇసుక వేస్తే రాలనంత రీతిలో భక్తులతో ఈ క్షేత్రం నిండిపోతుంది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం మొక్కుబడి భక్తుల్లో నమ్మకాన్ని పెంచింది. అలాగే ఈ ఆలయ ఆదాయం కూడా రికార్డు స్థాయిలో భారీగా పెరిగింది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రతి శనివారం సుమారు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఆదాయం వచ్చేది. వారం వారం భక్తుల సంఖ్య పెరుగుతుంది. ఈ నెలలో గత శనివారం రూ.65.44 లక్షల ఆదాయం రాగా ఈ శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా మహిళా భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. దానికి అనుగుణంగానే ఆదాయం కూడా పెరిగింది. ఈ శనివారం స్వామివారి సేవలు ద్వారా ఒక్క రోజు దేవస్థానానికి రూ.81,54,392 ఆదాయం సమకూరింది. ఆ విధంగా గత వారం కంటే ఈ వారం సుమారు రూ.17.10 లక్షల ఆదాయం పెరిగింది. దేవదాయ-ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో పెరిగిపోతున్న భక్తులకు అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ క్షేత్రం శనివారాలే కాకుండా వారంలో మిగిలిన రోజులన్నీ నిత్య కల్యాణం పచ్చతోరణంలా విరాజిల్లుతుంది. శనివారం ఏడు ప్రదక్షిణలు చేయలేమని భావించిన భక్తులు ఇతర వారాల్లో ఏదో ఒక వారాన్ని నిర్ణయించుకుని ఆ ఏడు వారాల్లో ఏడు ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకుంటున్నారు. అలా శనివారం తరువాత ఆదివారం వాడపల్లి క్షేత్రానికి అత్యధికంగా భక్తులు తరలివస్తున్నారు.

న్యాయం కోసం మహిళ పోరాటం

- భర్త మరణం తెలుసుకుని కుమారుడితో అంత్యక్రియలు
- పెద్ద కార్యం అనంతరం ఇంటి నుంచి కోడలు గెంటివేత
- ఆదివారం పోలీసులకు ఫిర్యాదు



కూనవరంలో తాళం వేసిన ఇంటివద్ద కుమారుడితో జ్యోతి

సీతానగరం: మండలంలోని కూనవరంలో ఓ అమానుష ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే రాపాకకు చెందిన జ్యోతికి కూనవరానికి చెందిన సుంకర వీరబాబుతో పదకొండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పదేళ్ల కుమారుడు చైతన్య ఉన్నాడు. గత ఐదేళ్ల క్రితం వీరబాబు కనిపించకుండా వెళ్లిపోవడంతో సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తనకు, తన కుమారుడికి పోషణ ఇవ్వాలని కోరుతూ జ్యోతి కోర్టును ఆశ్రయించింది. కాగా గత నెల 28న అనకాపల్లి జిల్లా పరవాడ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో వీరబాబు మృతి చెందాడు. వీరబాబు మృతి చెందాడన్న విషయం కోడలికి చెప్పకుండా అత్త గంగాభవాని మృతదేహాన్ని రాజమహేంద్రవరం కైలాస గిరికి తీసుకువచ్చింది. భర్త మరణించాడని, అంత్యక్రియలు జరుగుతున్నాయని స్థానికుల సమాచారంతో జ్యోతి తన తల్లిదండ్రుల సహకారంతో కుమారుడు చైతన్యను తీసుకుని రాజమహేంద్రవరం చేరుకుని కుమారుడితో అంత్యక్రియలు జరిపించి అత్తింటికి చేరుకుంది. శనివారం (ఈనెల 13) కుమారుడితో భర్త దిశదిన కర్మలు పూర్తి చేయించింది. పెద్ద కార్యం అనంతరం అత్త గంగాభవాని కోరుకొండలో ఉంటున్న కూతురు, అల్లుడితో కలసి కోడలు జ్యోతితో పాటు తల్లిదండ్రులను ఇంటి నుంచి బయటకు గెంటివేశారు. జ్యోతి తల్లిదండ్రులు రాపాక చేరుకోగా, జ్యోతి తన అత్తింటి వద్ద ఆరుబయటే ఉండిపోయింది. ఆదివారం ఉదయం అత్త ఇంటికి తాళం వేసి కోరుకొండలోని కుమార్తె ఇంటికి వెళ్లిపోయింది. దాంతో దిక్కుతోచని పరిస్థితిలో తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు తీసుకున్న ఎస్సై డి.రామ్‌కుమార్ తగు చర్యలు తీసుకుంటానని విలేకరులకు తెలిపారు.

ఉత్సాహ భరితంగా స్పోర్ట్స్ మీట్



కాకినాడ జరిగిన అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలతో ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు తదితరులు



కాకినాడ జిల్లా బాలికల కబడ్డీ జట్టు

- ఈనెల 27 నుంచి ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక
- జిల్లాలో పలు పాఠశాలల నుంచి హాజరైన క్రీడాకారులు

కాకినాడ రూరల్: విజయం కోసం పరుగు పడుతూ.. వారిలో ప్రతిభను బయటకు చాటారు. పరుగులోనే కాదు షాట్‌పుట్, లాంగ్ జంప్ ఇలా స్పోర్ట్స్ ఏదైనా విజయం సాధించడమే లక్ష్యంగా తమలోని క్రీడా స్ఫూర్తిని చాటుకుంటూ విజయం సాధించారు. జిల్లాలోని పలు వివిధ మండలాల్లో పాఠశాల నుంచి వచ్చిన క్రీడాకారులు. కాకినాడ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక కోసం కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణం వేదికయింది. ఉత్సాహ భరిత వాతావరణంలో పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో వంటి పోటీలు జరిగాయి. అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20 బాల, బాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి, పోటీలో విజయం సాధించిన వారిలో 67 మందిని జిల్లా నుంచి రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారు. విజేతలకు ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు, అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంఈఓ రంగారావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు మెమెంటోలు అందజేసి, అభినందనలు తెలిపారు. కోచ్‌లు రెడ్డి, ప్రవీణ్‌కుమార్, భాను, గిరి, వీరబాబు, రాజేష్ ఖన్నా, సంతోష్, రాజు, శివ, హరిబాబు, కిరణ్, దీపిక, అఖిల్ తదితరులు పోటీలు స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించారు.

జిల్లా కబడ్డీ జట్లు ఇవే..

సామర్లకోట: రాష్ట్ర స్థాయి 51వ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి జిల్లా బాలికల, బాలుర జట్లను కాకినాడ పీఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపిక అయిన జిల్లా జట్లు ఈనెల 22 నుంచి 25 వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన వలసి ఉంటుందన్నారు. ఇంటర్నేషనల్ కోచ్ పోతుల సాయిప్రసాద్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి నిమ్మకాయల కిరణ్‌కుమార్, పీడీలు తాళ్లూరి వైకుంఠం, ఎం.శ్రీనివాసుకుమార్, శ్యామ్, శ్వేతల పర్యవేక్షణలో ఎంపిక జరిగిందన్నారు.

బాలుర జట్టు

కాకినాడ జిల్లా కబడ్డీ జట్టుకు ఎస్.అవినాష్, పి.హరీష్, ఎన్.వంశీ, కె.జాన్, పి.అనిల్‌కుమార్, కేఎస్ సాయి, ఆర్.సాయిరామ్, బి.ఎలీషా, యు.వీరచక్ర, ఈ.నరేంద్ర, పీఎల్ నారాయణ, జి.త్రిమూర్తులు, జి.నరేష్, బి.ఫణికుమార్ ఎంపికయ్యారని తెలిపారు.

బాలికల జట్టు

జి.పావనీ, ఎ.మౌనిక, బి.మంజులరాణి, కె.జీవనజ్యోతి, బీఎస్ పల్లవి, ఎం.మానస, కె.అరుణ, జె.లక్ష్మీదుర్గ, ఎంవీడీ మహాలక్ష్మి, వి.పాప, కె.గాయత్రి, జి.సత్య శ్రీవల్లి, పి.ఆదిలక్ష్మి, ఏజీ భవాని, పి.శ్రావణి ఎంపికయ్యారని వివరించారు.

అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ గార్డుల నిజాయితీ

ప్రయాణికుడు మరచిపోయిన ఆభరణాలు తిరిగి అప్పగింత



ప్రయాణికుడు షేక్ ఖాజా మొహిద్దీన్‌కు ఆభరణాల బ్యాగ్ అందజేస్తున్న ఎస్సై శ్రీహరిబాబు

అన్నవరం: అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది ఒక ప్రయాణికుడు మర్చిపోయిన రూ.పది లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాల బ్యాగ్‌ను పోలీసుల సమక్షంలో తిరిగి అతడికి అప్పగించి తమ నిజాయితీ చాటుకున్నారు. ఆదివారం రాత్రి 7.30 గంటలకు కాకినాడ నుంచి విశాఖపట్నం బస్సులో ప్రయాణిస్తున్న భక్తులు కొంతమంది రత్నగిరి సత్యదేవుని ఆలయానికి వెళ్లే మొదటి ఘాట్‌రోడ్ టోల్‌గేట్ వద్ద బస్సులోంచి దిగారు. వారు తమ బ్యాగులతో పాటు మరో బ్యాగ్ కూడా తీసుకుని దిగిపోయారు. అయితే ఆ తరువాత ఆ బ్యాగ్ తమది కాదని గుర్తించి ఆ బ్యాగ్‌ను దేవస్థానం సెక్యూరిటీ గార్డులకు అందజేశారు. దాంతో సెక్యూరిటీ గార్డులు ఆ బ్యాగ్‌ను తెరచి చూడగా అందులో సుమారు రూ.పది లక్షలు విలువ చేసే పది కాసుల బంగారు ఆభరణాలు ఉన్నాయి. దీంతో ఆ సెక్యూరిటీ గార్డులు ఆ బ్యాగ్ గురించి దేవస్థానం సెక్యూరిటీ ఆఫీసర్ ఏపీ రావుకు తెలియజేశారు. దాంతో ఆయన ఆ బ్యాగ్‌ను అన్నవరం ఎస్సై శ్రీహరిబాబుకు అప్పగించారు. ఆ బ్యాగ్ గురించి ఆ బస్సులోని వారికి ఎస్సై సమాచారం ఇవ్వగా అందులో ప్రయాణిస్తున్న షేక్ ఖాజా మొహిద్దీన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆ బ్యాగ్ తనదేనని తాను కాకినాడ నుంచి విశాఖపట్నం వెళుతున్నానని తెలిపారు. ఆ బ్యాగ్‌లో బంగారు వస్తువుల వివరాలు తెలిపి వాటిని కల్యాణ్ జ్యూయలర్స్‌లో కొన్నానని ఆ రశీదు కూడా చూపించడంతో అతని వివరాలు తెలుసుకుని నిజమని నిర్ధారించుకున్న తరువాత ఆ బ్యాగ్‌ను అతడికి అప్పగించారు. సెక్యూరిటీ గార్డులను ఎస్సై శ్రీహరిబాబు, దేవస్థానం సెక్యూరిటీ ఆఫీసర్ ఏపీ రావు అభినందించారు.